దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణ


బిహార్‌లో మహిళాకాంగ్రెస్ జాతీయ పరిశీలకుల సమావేశంలో పాల్గొన్న ఎస్తేర్‌రాణి

చిక్కడపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి దేశవ్యాప్తంగా ఆదరణ పెరుగుతోందని ఆ పార్టీ మహిళా విభాగం జాతీయ పరిశీలకులు, రాష్ట్ర మహిళాకాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ఎస్తేర్ రాణి అన్నారు. బిహార్ రాష్ట్రంలో వచ్చే అక్టోబర్‌లో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఆ రాష్ట్రంలో మహిళాకాంగ్రెస్ జాతీయ పరిశీలకుల సమావేశం గురువారం మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లాంబా అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎస్తేర్‌రాణి మాట్లాడుతూ బిహార్‌లో జరిగే ఎన్నికల్లో నితీష్‌కుమార్‌ను ఓడించి కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని కూటమి అధికారంలోకి రావడానికి అన్ని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు.

పద్యనాటకాలను భవిష్యత్ తరాలకు అందించాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే పద్యనాటకాలను కాపాడుకుంటూ ముందుతరాలకు అందించాలని సీబీఐ కోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతిశర్మ అన్నారు. తెలంగాణ ప్రభుత్వ చలనచిత్ర, నాటకరంగ అభివృద్ధి సంస్థ సౌజన్యంతో కల్పన కళానికేతన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి త్యాగరాయ గానసభలో శ్రీరామనవమి, హనుమాన్ జయంతి సందర్భంగా జరిగిన పద్యనాటకం సత్యహరిశ్చంద్రీయమ్ దృశ్యప్రదర్శన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ నటుడు, నిర్వాహకుడు దొంతి జంగయ్యగౌడ్ పర్యవేక్షణలో నిర్వహించిన సభాకార్యక్రమంలో నటులను సన్మానించిన నాగమారుతిశర్మ మాట్లాడుతూ పద్యనాటక ప్రదర్శనలను ప్రోత్సహించాలన్నారు. న్యాయవాది పి.శ్రీనివాసరావు, వ్యాపారవేత్త అయోధ్య రామయ్య, నటులు వేదవ్యాస వెంకటేశం, జంగయ్యగౌడ్, శ్రీనివాస్, భాస్కర్‌రావు, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గుడ్ ఫ్రై డే.. హెబ్రోన్ చర్చిలో ప్రత్యేక ఏర్పాట్లు

చిక్కడపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గుడ్‌ఫ్రైడే సందర్భంగా గోల్కొండ చౌరస్తాలోని భక్తసింగ్ స్థాపించిన ప్రతిష్ఠాత్మక హెబ్రోన్ చర్చిలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు చర్చి స్థానిక దైవసేవకులు జోసెఫ్ పి.కురియన్, చర్చి సొసైటీ ఛైర్మన్ జాన్ సుందరం, దైవసేవకులు ఎం.ఇమ్మాన్యుయేల్ తెలిపారు. గురువారం చర్చిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి 5 వేల మంది భక్తులు చర్చికి వస్తారని తెలిపారు. అమెరికా నుంచి ప్రత్యేకంగా ప్రత్యేక వర్తమానికులు సాల్మన్ ఎబినైజర్ విచ్చేసి దేవుని వాక్యాన్ని వినిపిస్తారని తెలిపారు.

ఉత్తమ నాటక ప్రదర్శనలకు ప్రేక్షకుల ఆదరణ

చిక్కడపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ నాటక ప్రదర్శనలను ఆదరించే ప్రేక్షకులు ఉన్నారని ప్రముఖ సినీదర్శకుడు రేలంగి నరసింహారావు అన్నారు. అందుకు ఉదాహరణ ఈ 'మంచం నాది కాదు' నాటిక ప్రదర్శనకు హాజరైన ప్రేక్షకులే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. వంశీ ఆర్ట్స్ థియేటర్స్ రేలంగి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి త్యాగరాయ గానసభలో మహతి క్రియేషన్స్ హైదరాబాద్ వారితో గోవిందరాజుల నాగేశ్వరరావు రచించిన 'ఈ మంచం నాది కాదు' హాస్యనాటిక బి.రాజగోపాల్ దర్శకత్వంలో ప్రదర్శించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో రేలంగి నరసింహారావు మాట్లాడుతూ ఈ నాటికలో అంతర్గతంగా సమాజానికి సందేశం అందించారన్నారు. ప్రముఖ నటుడు సుబ్బరాయశర్మ మాట్లాడుతూ ఏప్రిల్ 16న కందుకూరి వీరేశలింగం జయంతి తెలుగు రంగస్థల దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని వంశీ రామరాజు నాటకాలను ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. ఉగాండా నుంచి బూరుగుపల్లి వ్యాసకృష్ణ, నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, రేలంగి ఆర్ట్స్ కార్యదర్శి ఆర్.నారాయణరావు, సుంకరపల్లి శైలజ, సుధామయి తదితరులు పాల్గొన్నారు.

వర్షం నీటి పైప్‌లైన్ పనులు పూర్తిచేయాలి


వర్షం నీటి పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాబోయే వర్షాకాలంలో అంబర్‌పేట డివిజన్‌లో వర్షం నీరు సక్రమంగా పోయే విధంగా పైప్‌లైన్ పనులు చేపట్టాలని కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. ప్రేమ్‌నగర్ గ్రీన్ ల్యాండ్ హోటల్ వద్ద చేపట్టిన వర్షం నీటి పైప్ లైన్ పనులను గురువారం ఆయన పరిశీలించారు. స్థానికులకు ఇబ్బందులు కలగకుండా పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మేర వృత్తి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా మాధవ్



రాంనగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మేర కుల వృత్తి సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా వాడపల్లి మాధవ్, ప్రధాన కార్యదర్శి ఓజల రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మాడిశెట్టి లక్ష్మీనారాయణ, సెక్రటరీ జనరల్‌గా డాక్టర్ కె.శ్రీనివాస్, కోశాధికారిగా కర్నే శ్యామ్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శిగా జి.మంచం రవి, మేడి రాంబాబు, కోడిశెట్టి తిరుపతిలు నియమితులయ్యారు. అలాగే 11 మంది ఉపాధ్యక్షులు, 11 మంది కార్యదర్శులు, ఇద్దరు ప్రధాన కార్యదర్శులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వాడపల్లి మాధవ్ మాట్లాడుతూ మేర సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

ఆటోడ్రైవర్‌పై పోక్సో కేసు


ఆటోడ్రైవర్ ఆంజనేయులు

బర్కత్‌పుర, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బాలికను లైంగికంగా వేధించిన ఓ ఆటోడ్రైవర్‌పై కాచిగూడ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. అడ్మిన్ ఎస్‌ఐ డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడ లింగంపల్లిలో నివాసం ఉంటున్న రాములు కుమారుడు ఎస్.ఆంజనేయులు(46) వృత్తిరీత్యా ఆటోడ్రైవర్. స్కూల్ విద్యార్థులను ఆటోలో పాఠశాలకు తీసుకెళ్లి తిరిగి ఇంటికి తీసుకొచ్చేవాడు. బుధవారం రాత్రి 6వ తరగతి బాలికను ఆటోలో తీసుకొస్తూ లైంగికంగా వేధించాడు. దీంతో ఆ బాలిక జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం ఆటోడ్రైవర్ ఆంజనేయులును అదుపులోకి తీసుకుని పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటో చోరులకు ఏడాది జైలుశిక్ష

చిక్కడపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆటోను చోరీ చేసిన ఇద్దరు వ్యక్తులకు జడ్జి ఏడాదిపాటు జైలుశిక్ష విధించారు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ బి.రాజునాయక్ తెలిపిన వివరాల ప్రకారం... గత ఏడాది నవంబర్ 9వ తేదీన చిక్కడపల్లి సాయి బార్ అండ్ రెస్టారెంట్‌వద్ద తన రెంటల్ ఆటో(టీఎస్13యూఏ6114)ను ఎవరో చోరీచేశారని ఆటో ఓనర్ అనుగురే ప్రేమ్ చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. కుర్మరాజు, చాకలి బాలరాజు ఆటో చోరీ చేసినట్లుగా గుర్తించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని 9ఏసీజేఎం నాంపల్లి కోర్టులో హాజరుపర్చారు. వారి నేరం నిరూపితం కావడంతో జడ్జి ఎ.నిర్మల ఇద్దరు నిందితులకు ఏడాది జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితులకు శిక్ష పడడానికి కృషి చేసిన చిక్కడపల్లి క్రైమ్ పోలీసులకు ఏపీపీ శ్రీలత కృతజ్ఞతలు తెలిపారు.

రైలు ప్రయాణికుడి ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ చోరీ

బర్కత్‌పుర, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికుడి ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్‌ను దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఖైరతాబాద్‌లో నివాసం ఉంటున్న గోపాల్‌రామ్ జైపూర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి బిక్కనూర్ - కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. మహారాష్ట్రలోని ముక్తేడ్ రైల్వే స్టేషన్ వద్ద ల్యాప్‌టాప్ ఉన్న బ్యాగు, మరో హ్యాండ్ బ్యాగును దొంగలు తస్కరించారు. అందులో ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, ఆధార్‌కార్డు, పాసుపోర్టు ఉన్నాయి. గురువారం గోపాల్‌రామ్ కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

చూప్‌సాప్

గల్లీలో రోడ్డుపై మట్టి వ్యర్థాలను తొలగించిన జీహెచ్‌ఎంసీ



రోడ్డుపై పోసిన వ్యర్థాలను, చెత్తను తొలగించిన జీహెచ్‌ఎంసీ సిబ్బంది

రాంనగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్‌లోని చూప్‌చాప్ గల్లీ సాఫైంది. గుర్తు తెలియని వ్యక్తులు మట్టి వ్యర్థాలను రోడ్డుపై పోయడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 2వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో డంపింగ్ యార్డులు.. రోడ్లు అనే శీర్షికతో వచ్చిన కథనానికి డీఎంసీ, ఎఎంహెచ్‌వోలు స్పందించారు. అక్కడ గుట్టల్లా పేరుకుపోయిన మట్టిని గురువారం తొలగించి, రాకపోకలను పునరుద్ధరించారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేందుకు కృషి చేసిన 'ఆంధ్రజ్యోతి'కి కార్మికులు, వాహనదారులు, రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి కృతజ్ఞతలు తెలిపారు.


వినియోగదారులు సర్వీసు క్యాంపులో పాల్గొన్న ఆర్.పవనమూర్తి

బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు

బర్కత్‌పుర, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నట్లు ఏరియా-1 పీజీఎం ఆర్.పవనమూర్తి తెలిపారు. గురువారం బ్యాంకు కాలనీలో బీఎస్‌ఎన్‌ఎల్ ఆధ్వర్యంలో వినియోగదారుల సర్వీసు క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల సమస్యలకు సత్వర పరిష్కారంతో పాటు సర్వీసు క్వాలిటీ, మొబైల్ టారీఫ్‌లను వివరించి నూతన కస్టమర్లను చేర్చుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర నెట్‌వర్క్‌లతో పోలిస్తే ప్రస్తుతం బీఎస్‌ఎన్‌ఎల్ చౌకైన ధరలకు అత్యుత్తమైన సేవలందిస్తూ ప్రజాదరణ పొందుతోందన్నారు. సర్వీసు క్యాంపులను విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఎఫ్‌టీటీ, హెచ్, హైస్పీడ్, సెక్యూర్స్, సీమ్‌లెస్ కనెక్టివిటీ సర్వీసులను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్‌ఎన్‌ఎల్ డీజీఎం ఎం.నర్సింహులు, ఏజీఎం ఎస్.మురళీకృష్ణ, జి.రాములు, ఎస్.గోపాల్‌రెడ్డి, సీఏవో రత్నసదానంద్, ఎంటీవీ జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ రైటర్ల ఆందోళన

చిక్కడపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తీసుకొచ్చిన స్లాట్‌బుకింగ్ సిస్టమ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం అశోక్‌నగర్‌లోని చిక్కడపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన నిర్వహించారు. మూడు రోజులుగా ధర్నా, నిరసన తెలుపుతున్నా కూడా అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహించారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్ రైటర్లు జి.అబ్బయ్య, మొగులు రమేష్, రాంపల్లి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన స్లాట్‌బుకింగ్ సిస్టమ్ వల్ల తమకు ఉపాధి లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్‌ల విషయంలో పాత విధానాన్ని కొనసాగించాలని కోరారు. నూతన స్లాట్ బుకింగ్ సిస్టమ్‌ను రద్దు చేయాలని కోరుతూ సబ్‌రిజిస్ట్రార్ మల్లికార్జున్‌కు వినతిపత్రం సమర్పించారు. కాగా శనివారం డాక్యుమెంట్ రైటర్లు స్లాట్ బుకింగ్ చేయడంలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్‌రైటర్లు శ్రీనివాస్, అశోక్, కార్తీక్, బ్రహ్మం పాల్గొన్నారు.

ప్రజలు ఎవరైనా స్లాట్ బుక్ చేసుకోవచ్చు

ప్రజలు ఎవరైనా కూడా స్లాట్ బుక్ చేసుకుని నేరుగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని చిక్కడపల్లి సబ్‌రిజిస్ట్రార్ మల్లికార్జున్ తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. డాక్యుమెంట్ తయారీలో ఎవరి ప్రమేయం ఏమీ అవసరం లేదు.

- చిక్కడపల్లి సబ్‌రిజిస్ట్రార్ మల్లికార్జున్

ప్రతిపక్షాల గొంతు నొక్కడానికే ఈడీ కేసులు

ఆలిండియా కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు


ముషీరాబాద్ నుంచి ఈడీ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న ఆలిండియా కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు

ముషీరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెరాల్డ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దాఖలు చేసిన చార్జిషీట్‌లో ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ పేర్లను నామోదు చేయడం ప్రతిపక్షాలపై కక్షసాధింపు చర్యల్లో భాగమేనని ఆలిండియా కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు అన్నారు. గురువారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు ఈడీ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాకు ముషీరాబాద్ నుంచి బిజ్జి శత్రు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతోనే కాంగ్రెస్ నేతలపై ఈడీ కేసులు నమోదు చేసిందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా బీజేపీకి తీవ్ర వ్యతిరేకత వస్తుండడంతో దాన్ని కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ నేతలపై కేసులు పెడుతోందని మండిపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాము, బాలు, వెంకట్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

25 నుంచి పూలే - అంబేడ్కర్ జనజాతర సభలు : కేవీపీఎస్


మాట్లాడుతున్న టి.స్కైలాబ్‌బాబు

రాంనగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ రక్షణ కోసం అందరూ ఐక్యం చేయడానికి ఈ నెల 25 నుంచి పూలే- అంబేడ్కర్ జనజాతర సభలను కులవివక్ష వ్యతిరేక సమితి (కేవీపీఎస్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని సమితి రాష్ట్ర కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు తెలిపారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం నగర అధ్యక్షుడు ఎం.దశరథ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జనజాతర సభల్లో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుబ్బరావు, అశోక్, శ్రీరాములు పాల్గొన్నారు.


రాజ్యాంగ పీఠిక కరపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు లక్ష్మణ్‌కుమార్, శివకుమార్ తదితరులు

భారత రాజ్యాంగ పీఠిక కరపత్రాలు పంపిణీ

నల్లకుంట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవంలో భాగంగా బీజేపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు గురువారం బీజేపీ సెంట్రల్ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు, నల్లకుంట డివిజన్ అంబేడ్కర్ జయంతి ఉత్సవ కన్వీనర్ కె.లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో అంజయ్యనగర్‌లో భారత రాజ్యాంగ పీఠిక కరపత్రాలను పంపిణీ చేశారు. బస్తీలో బీజేపీ నేతలు మంగి శివకుమార్, ప్రశాంత్ జోషి, నాయకులు బాబు, కిషోర్, మధుసూదన్‌యాదవ్, శ్రీకాంత్, క్రాంతి, బస్తీ అధ్యక్షురాలు ప్రభావతి పాల్గొన్నారు.

బాగ్‌అంబర్‌పేటలో వీధిదీపాల సమస్య పరిష్కారం

నల్లకుంట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో వారం రోజులుగా వీధిదీపాలు వెలగడం లేదని స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ మేరకు స్థానిక ప్రజలు బీఆర్‌ఎస్ డివిజన్ ప్రధానకార్యదర్శి కెంచె మహేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన మహేష్‌కుమార్ గురువారం అంబర్‌పేట నియోజకవర్గం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ దృష్టికి తీసుకురాగా వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించాలని సూచించారు. దీంతో డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్ కాలనీ, మందులబస్తీ, గజానంద్‌గడ్డ మెయిన్ రోడ్డులో మహేష్‌కుమార్ ట్రాన్స్‌కో సిబ్బందిని ఆ ప్రాంతానికి రప్పించి స్ట్రీట్‌లైట్ టైమర్‌లో సమస్యను పరిష్కరించారు.


భాస్కర్‌యాదవ్‌కు నియామక పత్రం అందజేస్తున్న సంఘం నేతలు

అంబర్‌పేట నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షుడిగా భాస్కర్‌యాదవ్

నల్లకుంట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గం యాదవ సంఘం అధ్యక్షుడిగా నల్లకుంటకు చెందిన ఎం.భాస్కర్‌యాదవ్ నియమితులయ్యారు. యాదవ సంఘం గ్రేటర్ హైదరాబాద్ ఛైర్మన్ సి.నందకిషోర్‌యాదవ్, అధ్యక్షుడు బోయిని వెంకటేష్ యాదవ్ సంఘం అధ్యక్షుడిగా భాస్కర్‌యాదవ్‌ను ప్రకటించారు. ఈ మేరకు గురువారం నగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎం.భాస్కర్‌యాదవ్‌కు సంఘం నేతలు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో యాదవ సంఘం గ్రేటర్ హైదరాబాద్ నాయకులు సి.లడ్డుయాదవ్, పి.పాండుయాదవ్, కన్నె రమేష్ యాదవ్, మధుసూదన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి అమర వీరులు, అమరజీవుల స్మారకోత్సవాలు

రాంనగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి మే 1 వరకు అమరవీరులు, అమరజీవుల స్మారకోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి తెలిపారు. ఈనెల 19న అమరజీవి ఎండీ.గౌస్ నాలుగో వర్ధంతిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మేడేను సామ్రాజ్యవాద, యుద్ధనోన్మాదానికి వ్యతిరేకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మే 9న భీమ్‌రెడ్డి నర్సింహారెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మే 12న మచ్చాపూర్ స్మారకస్తూపం వద్ద ఎంసీపీఐ(యూ) ఓంకార్ శత జయంతి సభ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉపేందర్‌రెడ్డి, కుమారస్వామి, మట్టయ్య, రమేష్, మంద రవి, తూకారం నాయక్, చంద్రక్క, రాజమల్లేష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాల రద్దు.. పునరుద్ధరణ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కుల ధ్రువీకరణ పత్రాల జారీపై ఫిర్యాదులు రావడంతో జిల్లాస్థాయి పరిశీలన కమిటీ విచారణ అనంతరం చేసిన సిఫార్సుల మేరకు ఒక కమ్యూనిటీ సర్టిఫికెట్ రద్దు, మరోదానిని పునరుద్ధరిస్తూ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి నోటిఫికేషన్ జారీ చేశారు. ఖైరతాబాద్ తహసీల్దార్ 2022లో జారీ చేసిన ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేయడంతోపాటు ముషీరాబాద్ తహసీల్దార్ 2023లో ఇచ్చిన ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాన్ని పునరుద్ధరిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

వరంగల్ బీఆర్‌ఎస్ సభను జయప్రదం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

రాంనగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ రజతోత్సవం సందర్భంగా ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బహిరంగ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి జయప్రదం చేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పిలుపునిచ్చారు. విద్యానగర్‌లో గురువారం జరిగిన బీఆర్‌ఎస్ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు బల్ల శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్‌లోని ప్రతి బస్తీలో పార్టీ జెండాలు ఆవిష్కరించాలని సూచించారు. డివిజన్ నుంచి వెయ్యిమంది సభకు తరలిరావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, నాయకులు కె.సురేందర్, చిట్టి, మాధవ్, నేత శ్రీనివాస్, సయ్యద్ అస్లాం, రోషంబాలు, ఎర్రం శ్రీనివాస్ గుప్తా, యూనస్ తదితరులు పాల్గొన్నారు.

రూ.4 వేల కోట్ల ఫీజు బకాయిలు, బిల్లులు చెల్లించాలి


డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య తదితరులు

రాంనగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న రూ.4 వేల కోట్ల ఫీజు బకాయిలు, 5 నెలల బీసీ కాలేజీ హాస్టల్స్, మూడు సంవత్సరాల హాస్టల్ అద్దె బిల్లులు, సంవత్సరం కరెంట్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు ఆయన గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బిల్లుల చెల్లింపులో జాప్యం వల్ల ఫార్మసీ, ఇంజనీరింగ్, డిగ్రీ, కోర్సులు చదివే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వివిధ బకాయిలను మంజూరు చేయడానికి బడ్జెట్ కేటాయించాలన్నారు. స్పందించిన డిప్యూటీ సీఎం బకాయిలను త్వరలో మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు నీల వెంకటేష్, అంజి, జి.మల్లేష్, సతీష్, రాజేందర్, అనంతయ్య, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

రాంనగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి పేదలకు వరంగా మారిందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన సయ్యద్ షకీల్ ఉల్లా హుస్సేన్‌కు మంజూరైన రూ.60 వేలు, కొరివి శోభనకు రూ.3 లక్షలు, దివ్యకు రూ.22 వేల చెక్కులను గురువారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఆయన అందజేసి మాట్లాడారు. రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ ద్వారా ఈ ఆర్థిక సహకారం లబ్ధిదారులకు అందజేశామన్నారు.

అంజనీకుమారికి జాతీయ స్వర్ణనంది అవార్డు


అంజనీకుమారికి జాతీయ స్వర్ణనంది అవార్డును బహూకరిస్తున్న అతిథులు

చిక్కడపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో సిటీసివిల్ కోర్ట్ సీనియర్ సూపరింటెండెంట్ పీవీపీ అంజనీకుమారికి జాతీయ స్వర్ణనంది అవార్డును బహూకరించారు. త్యాగరాయ గానసభలో జరిగిన ఈ కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ పూర్వ ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త అంజనీకుమారికి అవార్డును బహూకరించి అభినందించారు. అంజనీకుమారి మాట్లాడుతూ ఈ అవార్డు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇది తన బాధ్యతను మరింత పెంచిందని, సమాజసేవను మరింతవిస్తృతం చేస్తానని తెలిపారు.

సాలమ్మకు దళితరత్న అవార్డు ప్రదానం



అవార్డు అందుకున్న డక్కలి కుల సంక్షేమ సంఘం మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు బి.సాలమ్మ

రాంనగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): డక్కలి సంక్షేమానికి ఆ సంఘం మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు బి.సాలమ్మకు దళితరత్న అవార్డు లభించింది. ఈ అవార్డును బాబు జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఉత్సవ కమిటీ ఛైర్మన్ ఇటిక రాజు గురువారం ఆమెకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డక్కలి కుల సంక్షేమం, అభివృద్ధి కోసం తాను అందిస్తున్న సేవలకు ఈ అవార్డు ప్రదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఉప కులాల రాష్ట్ర ఛైర్మన్ మేడి పాపయ్య, బేడ బుడగ జంగం వ్యవస్థాపక అధ్యక్షుడు తుర్పాటి హనుమంతరావు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల విద్యార్థులు శ్రద్ధ వహించాలి


రెయిన్‌బో హోం అనాథాశ్రమంలో బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ లారా మీనన్

ముషీరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని డాక్టర్ లారామీనన్ అన్నారు. గురువారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలోని రెయిన్‌బో హోం అనాథాశ్రమంలో విద్యార్థినులకు ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లారా మీనన్ మాట్లాడుతూ... పౌష్టికాహారం తీసుకోవాలని, ప్రతిరోజూ కొద్ది సేపు వ్యాయామం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ప్రతినిధులు శ్రీదేవి, ప్రజ్ఞ, రెయిన్‌బోహోం ఇన్‌చార్జి సదాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


పౌష్టికాహారంతో మెరుగైన ఆరోగ్యం

ముషీరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని ఐసీడీఎస్ ముషీరాబాద్ సెక్టార్ సూపర్‌వైజర్ జి.జ్యోతి సూచించారు. గురువారం భోలక్‌పూర్ డివిజన్ రంగానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సికింద్రాబాద్ ప్రాజెక్టు ముషీరాబాద్ సెక్టార్ ఆధ్వర్యంలో పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జ్యోతి మాట్లాడుతూ.... గర్భిణులు తప్పనిసరి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అన్నప్రసన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో జె.స్వప్న, అంగన్‌వాడీ టీచర్‌లు భాగ్యరేఖ, పద్మాబాయి, ఉమాదేవి, ప్రమీల, జ్యోతి, అలివేలుమంగ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజరాజేశ్వరి ఆలయ వార్షికోత్సవం

చిక్కడపల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి బాపునగర్‌లోని రాజరాజేశ్వరి దేవాలయం వార్షికోత్సవం గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం భవాని శంకర సమేత రాజరాజేశ్వరి దేవికి అభిషేకం, విశేషాలంకరణ, కుంకుమార్చన, మండపారాధనం, కలశస్థాపనం, లక్ష్మీగణపతి హోమం, రుద్రదేవి నవగ్రహాది మండప హోమాలు, గురుపాదపూజ, పసుపు దంపుడు, కొట్నం, భద్రకాళి అమ్మవారి కుంకుర్చాన, మహామంగళహారతి కార్యక్రమాలు ఆలయ అర్చకులు శివశ్రీ ఆనంద్‌స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాలాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు


శ్రీబాలాంజనేయస్వామి దేవాలయం వద్ద అన్నదానం చేస్తున్న బీజేపీ నేతలు

కవాడిగూడ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి, హనుమాన్‌జయంతి ఉత్సవాలను ప్రశాంతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించిన బాలాంజనేయ ఆలయ కమిటీ సభ్యులు, భక్తులను బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్ అభినందించారు. హనుమాన్ జయంతి ముగిసిన ఐదు రోజుల తరువాత గురువారం కవాడిగూడ కామునికుంతలోని బాలాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, కె.పరిమళ్‌కుమార్, బీజేపీ నగర నాయకులు ఎంసీ మహేందర్‌బాబు, బీజేపీ డివిజన్ ప్రధానకార్యదర్శి ఎ.ప్రభాకర్ గంగపుత్ర, సీహెచ్.శ్రీనివాస్ ముదిరాజ్, శివరాజ్, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు డి.శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు, ప్రధాన అర్చకుడు చిరంజీవి పాల్గొన్నారు. పూజలు నిర్వహించిన వారిని ఘనంగా సత్కరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.